www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 15 జూన్ 2023
5
చిత్తూరు



వార్డు సచివాలయ కార్యదర్శుల

బదిలీలకు నేడు కౌన్సిలింగ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలోని వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి కౌన్సిలింగ్ ప్రక్రియ గురువారం ఉదయం 8.30గంటల నుంచి ప్రారంభమవుతుందని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు. బదిలీల కోసం వివిధ కేటగిరీల కింద ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అడ్మిన్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్, వెల్ఫేర్, శానిటేషన్ ఎన్విరాన్మెంట్, ప్లానింగ్ కార్యదర్శులు 116మంది అభ్యర్థులు (విభజనకు పూర్వం చిత్తూరు జిల్లా పరిధిలోని) కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. కౌన్సిలింగ్ హాజరయ్యే అభ్యర్థులు బదిలీల మార్గదర్శకాల కోసం అధికారులు జారీ చేసిన సర్క్యులర్లను క్షుణంగా చదవాలని, నిర్దేశించిన ధృవీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు. బదిలీల కోసం నగరపాలక సంస్థ ఆవరణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. బదిలీల ప్రక్రియ పర్యవేక్షులుగా ఆర్డీటీపీవో బి.సుదర్శన్, అనంతపురం ఆర్డీఎంఏ కార్యాలయం అధికారులు అనీప్, ఇలియాస్ హాజరవుతున్నట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలను కుప్పం నుంచే ప్రారంభిస్తా

పర్యటనలో నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - కుప్పం, శాంతిపురం

'సంక్షేమ పథకాలను కుప్పం నుంచే ప్రారంభిస్తా' అని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. కుప్పం నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌నుంచి బెంగుళూరు చేరుకున్న ఆయన అక్కడనుంచి రోడ్డు మార్గంలో కర్నాటక సరిహద్దుకు చేరుకున్నారు. అక్కడ టిడిపి శ్రేణులు భారీ గజమాలలతో చంద్రబాబుకు స్వాగతం పలికారు. రాళ్లబూదుగూరు బస్టాండ్‌లో తాను తీసుకొస్తున్న ఎన్నికల మినీ మ్యానిఫెస్టోను వివరించారు. అక్కడనుంచి కుప్పం చేరుకున్న ఆయన బిసిఎన్ కన్వెన్షన్ హాలులో నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశమయ్యారు. తన సొంత నియోజకవర్గంలో సొంత ఇల్లు నిర్మించుకోడానికి సయితం తనకు అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. వైసిపి పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిందన్నారు. సీఎం జగన్ అంత అవినీతిపరుడు దేశంలో ఎవరూ లేరని సాక్షాత్తు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పడాన్ని రాష్ట్ర ప్రజలు గమనించారన్నారు. సీఎం అవినీతిపై కేంద్రమంత్రులు ప్రకటన చేయడం కాదని, జగన్‌పై చర్యలు ఎపుడు తీసుకుంటారో చెప్పాలన్నారు. కుప్పంలో గ్రానైట్‌ను దోచేస్తున్నారని, టిడిపి అధికారంలోకి వచ్చాక దోచిందంతా కక్కిస్తానన్నారు. రెండువేల రూపాయల నోట్లను వైసిపి నేతలు బ్రాందీషాపుల్లో మార్చుకుంటున్నారని, దీనిపై కేంద్రం దృష్టి సారించాలన్నారు. సంక్షేమ పథకాలకు తమ పార్టీ వ్యతిరేకం కాదని, అయితే అప్పులు చేసి కాకుండా, సంపద సృష్టించి అందించాలన్నారు. ప్రశాంతమైన కుప్పంలో రౌడీలతో బెదిరిస్తున్నారని, వడ్డీతో సహా లెక్కపెట్టి అణచివేస్తానన్నారు. తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిన వారిని వదిలేది లేదన్నారు. రాత్రికి ఆర్ అండ్ బి అతిథిగృహంలో బస చేయనున్నారు. గురువారం కుప్పంలోనే నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఇతర పార్టీల నాయకులను భారీ స్థాయిలో టిడిపిలోకి ఆహ్వానం పలకనున్నారు. అనంతరం కుప్పంలో భారీ బహిరంగసభలో పాల్గొంటారు.



రాళ్లబూదుగూరు బహిరంగసభలో మాట్లాడుతున్న చంద్రబాబు

మహిళా సమస్యలు తీరేనా..!

గడపగడపకూ మహిళా పోలీస్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మహిళా భద్రత కోసం గడపగడపకు మహిళా పోలీసులు పర్యటిస్తున్నారు. మహిళలు ఏవిధమైన వేధింపులు ఎదుర్కొంటున్నారు. ఏరకమైన సమస్యలు, అవమానాలకు గురైతున్నారు. ఇంటా.. భయటా.. ఎలాంటి వేధింపులు ఎదుర్కొవాల్సి వస్తోందనే అంశాలను తెలుసుకొని మహిళలకు అండగా నిలిచేలా పోలీసులు ఈ కార్యక్రమాన్నికి శ్రీకారం చుట్టారు. చిత్తూరు జిల్లాలో 35 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 35 వార్డులో తొలిదశలో ప్రతి గడపకు వెళ్లి మహిళలతో సఖ్యతగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు మహిళా పోలీసులు తెసుకుంటున్నారు. ఈనెల 9వ తేదీ జిల్లా కేంద్రమైన చిత్తూరులోని 15వ డివిజన్‌లో డిఐజి అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ గడపగడపకు మహిళా పోలీస్ కార్యక్రమాని ప్రారంభించారు. ప్రతి మహిళా మాట్లాడాలి, పోలీస్ స్టేషన్‌కు దౌర్యంగా వచ్చి సమస్యల పోలీస్‌ల దృష్టి తీసుకురావాలనే ఉద్ధేశంతోనే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్ధేశ్యం.



గడపగడపకు మహిళా పోలీస్ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న డిఐజి (ఫైల్‌ఫొటో)

గడపగడప వెళ్లి ఏం చేస్తారంటే..

2021లో గుంటూరులో చోటు చేసుకున్న విద్యార్థి రమ్య హత్య కేసులో మృతురాలు అనుభవించిన వేధింపులు, మానసిక వేదన స్నేహితురాలి ద్వారా రమ్య అనుభవించిన మానసిక వేదన మరో మహిళ అనుభవించకూడనే పోలీసులు భరోసా కల్పించేలా ఈ కార్యక్రమాన్ని పోలీస్‌శాఖ నిర్వహిస్తోంది. ప్రతి మహిళా పోలీసులతో ఓపెన్‌గా మాట్లాడాలి. ఇందు కోసం ప్రతి గడపకు గ్రామ, వార్డు సచివాలయాల్లోని మహిళా పోలీసులు కార్యదర్శి, వాలంటీర్ వస్తున్నారు. ఇంట్లోని మహిళలతో మహిళా కార్యదర్శి ఒంటరిగా మాట్లాడుతుంది. కాలనీల్లో అకతాయిల వేధింపులు, సారా విక్రయాలు, గంజాయి అమ్మకాలపై వివరాలు సేకరిస్తారు. టీనేజీ అమ్మాయిల స్మార్ట్‌ఫోన్లు వాడకం, వారు చదువుతున్న విద్యా సంస్థలో ఏవైనా వేధింపులున్నాయా.. తెలుసుకొని వారి స్మార్ట్‌ఫోన్లలో దిశా యాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. ఆపద సమయాల్లో దిశా యాప్‌ను ఎలా వాడాలో నేర్పిస్తారు. పోలీస్ ఉన్నతాధికార్ల నెంబర్లు ఉన్న కార్డును అందజేస్తారు.

సమాచారమిద్దాం.. సహకరిద్దాం..

గడపగడపకు వచ్చి సర్వే చేస్తున్న మహిళా పోలీసుకు సమాచారం ఇవ్వడం శ్రేయొస్కరం. సమచారాన్ని గోప్యంగా ఉంచి సమస్యలను పోలీసులు పరిష్కరిస్తారు. గడపగడపకు మహిళా పోలీస్ కార్యక్రమంలో పోలీసులు రూపొందించిన 10ప్రశ్నలు అడుగుతారు వాటికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది. మన ప్రాంతంలో ఎలాంటి చట్టవ్యతిరేక, సంఘవ్యతిరేక కార్యక్రమాలు జరుగున్నా వీరి దృష్టికి తీసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం అవుతాయని పోలీస్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇందు కోసమే ఈకార్యక్రమాన్ని పోలీస్‌శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందంటున్నారు. మనం మహిళా వాలంటీర్‌కు చెప్పిన సమస్యలు నేరుగా జిల్లా ఎస్పీకి ఎప్పటికప్పుడు తెలిసేలా యాప్‌ను రూపొందించారు. ఈసర్వేలో వచ్చిన సమస్యల ఆధారంగా పోలీస్‌శాఖ ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఓకార్యక్రమాన్ని రూపొందించనుంది. నేడు మహిళా వేధింపులు, ప్రేమపేరుతో మోసాలు, చాటు మాటుగా జరుగతున్న చట్టవ్యతిరేక, సంఘవ్యతిరేక కార్యక్రమాలు, గృహ హింసలు, బాలికలపై అత్యారాలు, అకతాయిల వేధింపులు పోలీసులుశాఖ చేపడుతున్న గడపగడపకు మహిళా పోలీస్ కార్యక్రమం ద్వారా కొంతమేరకైనా తగ్గుతాయని ఆశిద్దాం. ఇందుకోసం సచివాలయ మహిళా పోలీస్, వాలంటీర్‌కు సహకరిద్దాం.



ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న మహిళా పోలీస్, వాలంటీర్ (ఫైల్‌ఫొటో)

'జగనన్నకు చెబుదాం' సమస్యలు పరిష్కరించండి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు సిఎం ఆదేశాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు మరింత మెరుగ్గా పరిష్కారం చూపేందుకు వీలుగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, సమస్యతో వచ్చిన అర్జీదారుడు సమస్య పరిష్కారమై వారి ముఖాల్లో చిరునవ్వు కనిపించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లతో జగనన్నకు చెబుదాం, గడపగడపకు మన ప్రభుత్వం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జగనన్న హౌసింగ్ ప్రోగ్రాం, వ్యవసాయశాఖ, జగనన్న భూ హక్కు- భూ రక్ష పథకాల పురోగతిపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు జిల్లా నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమ జిల్లా ప్రత్యేక అధికారి జి.వీరపాండియన్, కలెక్టర్ ఎస్.షన్మోహన్, ఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజల వినతుల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా అందిన అర్జీలకు పూర్తి నాణ్యతతో పరిష్కారం చూపాలని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా చేపట్టిన పనుల్లో పురోగతి చూపాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఉపాధి కూలీలకు పనిచేసే చోట షెడ్స్, తాగునీటి వసతి, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల భవనాల నిర్మాణ పనులలో స్టేజ్ అప్ గ్రాడ్యుయేషన్ ఉండాలన్నారు. హౌసింగ్ పథకంకు సంబంధించి ప్రతి శనివారం మండల, మున్సిపాలిటీలలో సంబంధిత అధికారులు వారి పరిధిలో గల రెండు హౌసింగ్ లేఔట్‌లను పరిశీలించి గహనిర్మాణాల పురోగతికి కషి చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు నాణ్యతతో కూడిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. విసి అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాలలో భాగంగా అందిన ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జూన్ 23న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం చుట్టనున్నారని, ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం క్రింద ఉపాధి కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన వేతనం సగటుకు తగ్గకుండా అందించాలని, వారు పనిచేసే చోట వారికి అవసరమైన కనీస వసతులను కల్పించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణ పురోగతిలో స్టేజ్ కన్వర్షన్ కచ్చితంగా ఉండాలని తెలిపారు. జగనన్న హౌసింగ్ కాలనీలలో నిర్మాణ పురోగతిని అర్బన్, రూరల్ పరిధిలో హౌసింగ్‌డే గా ప్రతి శనివారం రెండు హౌసింగ్ లేఔట్లలో సంబంధిత అధికారులు వెళ్లి లబ్ధిదారులు గహాలను నిర్మించుకునేలా అవగాహన పెంచాలన్నారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన రుణ సదుపాయాన్ని కల్పించాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన నాణ్యతతో కూడిన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, దీనితోపాటు కౌలురైతులకు కార్డులను సకాలంలో అందజేయాలన్నారు. జగనన్న భూహక్కు -భూరక్ష పథకం కింద చేపట్టిన రెండవదశ పనులను వేగవంతం చేయాలన్నారు. రెండవ దశ పనులను నిర్ణీత సమయంలోపు పూర్తిచేసి జగనన్న భూహక్కు పత్రాలను అందించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీధర్, డ్వామా పిడి గంగాభవాని, సిపిఓ ఉమాదేవి, సర్వేశాఖ ఏడీ గౌస్ బాషా, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, ఎస్పీ

తగినన్ని మందులు స్టాక్ ఉన్నాయా..?

మెడికల్ ఆఫీసర్‌ను ప్రశ్నించిన కలెక్టర్

ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశం

యాదమరి, బంగారుపాళ్యం మండలాలలో క్షేత్రస్థాయి పర్యటన



పిహెచ్‌సిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- యాదమరి: కౌమార దశ బాలికలు, గర్భవతులు, బాలింతలలో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా యాదమర్రి మండలం మాదిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 14- కండ్రిగ గ్రామ సచివాలయం, హౌసింగ్ లేఔట్‌ను, పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులను పరిశీలించారు. అలాగే బంగారుపాల్యం మండలం తుంబు కుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులను, జంబువారిపల్లి, దండువారిపల్లి హౌసింగ్ లేఔట్లను పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా యాదమర్రి మండలం మాదిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మెడికల్ ఆఫీసర్‌ను ఈ పీహెచ్‌సి పరిధిలో రోజుకు ఎంతమంది పేషెంట్లు వస్తున్నారని, ఎంతమంది గర్భవతులు ఉన్నారని, తగినన్ని మందులు స్టాక్ ఉన్నాయని ప్రశ్నించారు. రోజుకు 60మంది దాకా పేషెంట్లు వస్తున్నారని, పిహెచ్‌సి పరిధిలో 194మంది గర్భవతులు ఉన్నారని, వారికి అవసరమైనన్ని మందులు స్టాక్ ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ కలెక్టర్‌కు వివరించారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎన్ని గంటల నుండి ఎన్ని గంటల వరకు అందుబాటులో ఉంటుందని, వైద్యులు సరైన సమయానికి వైద్యం అందిస్తున్నారా అని రోగులను కలెక్టర్ అడిగారు. వారు ఉదయం 8.30 గంటల నుండి సాయంత్రం 4.30గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని వైద్యసేవలు అందిస్తారని పేషెంట్లు కలెక్టర్‌కి వివరించారు. అనంతరం 14- కండ్రిగ హౌసింగ్ లేఔట్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈలేఔట్‌లో 24 ఇండ్లు మంజూరు కాగా 6 పూర్తికావడం జరిగిందని అధికారులు కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులందరూ ఇంటి నిర్మాణాలు కచ్చితంగా చేసుకొనేలా అవగాహన పెంచాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

బంగారుపాళ్యం మండలం తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మిక తనిఖీ చేసి పేషెంట్స్‌కు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా చేశారు. జంబువారిపల్లి, దండువారిపల్లి హౌసింగ్ లేఔట్లను కలెక్టర్ పరిశీలించి గహ పురోగతిపై ఆరా తీశారు. జంబు వారిపల్లి లేఔట్‌లో 45 ఇండ్లు మంజూరు కాగా ఆరు ఇండ్లు పూర్తి కావడం జరిగిందని, దండువారిపల్లిలో 18 ఇండ్లు మంజూరు కాగా ఆరు పూర్తి కావడం జరిగిందని అధికారులు కలెక్టర్ వివరించగా ఆర్‌సి నుండి ఆర్‌ఎల్ స్థాయికి స్టేజికన్వర్షన్ కచ్చితంగా జరగాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ పద్మనాభం, యాదమరి ఎంపిడిఓ శివరాజ్, హౌసింగ్ ఏఈ బాపిరాజు, ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు, బంగారుపాళ్యం ఎంపీడీ వారిప్రసాద్ రెడ్డి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

లేఅవుట్‌లో పనులను పరిశీలిస్తూ..



అర్హులందరికీ సంక్షేమ పథకాలు : డిప్యూటి సిఎం



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటి సిఎం

ప్రజాశక్తి-పాలసముద్రం: ప్రజలకు అన్నిరకాల ప్రభుత్వ సేవలు సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చి, ఇబ్బందులు పడకుండా అవసరాలను తీర్చుతున్న ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కిందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. బుధవారం మండలంలోని తిరుమలరాజపురం గ్రామ సచివాలయ పరిధిలోని, తిరుమలరాజపురం బీసీ కాలనీ, ఆదిఆంధ్రవాడ, గంగ మామపురం దళితవాడ, బలిజూరు, మిట్టకండ్రిగ గ్రామాల్లో సర్పంచ్ జీవిత, ఎంపీటీసీ కుప్పమ్మ, చంద్రకుమార్ సమీక్షంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఎం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులను జగనన్న శ్రీకారం చుట్టారని అన్నారు. చంద్రబాబు పాలనలో పాడైపోయిన ప్రభుత్వ పాఠశాలలను నేడు కార్పోరేట్ స్థాయికి చేరాయన్నారు. ఒకప్పుడు తాగునీరు, మరుగుదొడ్లు కూడా లేని పాఠశాలలో నేడు మినరల్‌వాటర్, అత్యాధునిక మరుగుదొడ్లు అందుబాటులో వచ్చాయని అన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు వెంటనే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సచివాలయ, వాలంటీరు వ్యవస్థలను తీసుకొచ్చి ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి అని కొనియాడారు. బెంగళూరు పారిశ్రామికవేత్త చంద్రకుమార్ మండలస్థాయి అధికారులకు ఘనసన్మానం చేశారు. జడ్పిటిసి సభ్యులు అంబలగం, ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, నాయకులు వాసు రాజు, సుందర రాజు, పుత్తూరు కేశవరెడ్డి ఇందిరమ్మ, షణ్ముఖ రెడ్డి, తహశీల్దార్ బాబు, ఎంపీడీవో ప్రేమ్ రాజ్ కుమార్, ఐకేబి పీఎం ఫరీద్ మస్తాన్, ఎంఈఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సప్లమెంటరీ ఫలితాల్లో విద్యావికాస్ అద్భుత ఫలితాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇంటర్ సప్లమెంటరీ ఫలితాల్లో విద్యావికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కరెస్పాండెంట్ ప్రకాష్‌చంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిసి విభాగంలో దీపికా 466, మౌనిక 466 టౌన్‌ఫస్ట్, స్టేట్ సెంకడ్ ర్యాంక్ సాధించారని తెలిపారు. అలాగే యెస్వీని 465 మార్కులు సాధించి స్టేట్ మూడో ర్యాంకు టౌన్ రెండో ర్యాంక్ సాధించిన్నట్లు పేర్కొన్నారు. బైపిసి విభాగంలో లికిత 425, పల్లవి 424 మార్కులు అలాగే తమ కళాశాలలో 400 పైగా 49మంది విద్యార్థులు సాధించారని నీట్ ఫలితాలో హరిత 584 స్వప్నశ్రీ 221 మార్కులు సాధించిన్నట్లు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాల్లో జన్యశ్రీ 7433, హేమలత 7937, దేవదర్శిని 10051, పూజిత 14712, యశస్వీనీ 14793, వ్వపన్నశ్రీ 15546 సాధించారని ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విజ్ఞానదీప్తి విద్యాసంస్థల వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, రామంజులు, నరేష్ చంద్రారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



ఎంసెట్ ఫలితాల్లో

పిఎస్ఎన్ వివేకానంద టౌన్ టాపర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

బుధవారం ప్రకటించిన ఎంసెట్ ఫలితాల్లో శ్రీపిఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థి సాయితేజారెడ్డి 734 ర్యాంకు సాధించి టౌన్‌టాపర్‌గా నిలిచారని కళాశాల కరెస్పాండెంట్ సత్యనారాయణ తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు ఎంసెట్ ఫలితాల్లో నితిన్ 2637, సౌదన్య బైపిసి 2968, మౌనికా చౌదరి 3124, తరుణ్‌స్కధ 4416, గీతాశ్రీ 5636, హేమంత్ 5678, హర్షిత 6015, లక్ష్మీనారాయణ 6556, కావ్య 6901, తేజస్వీ 6918, రేష్మ 7548 ర్యాంకులు సాధించారని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అధ్యాపకులకు కరెస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజుశెట్టిలు అభినందించారు.



ఎంసెట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన సాయితేజారెడ్డి

ఎంసెట్ ఫలితాల్లో 'మదర్ థెరిసా'కు 120 ర్యాంకులు

ప్రజాశక్తి- గంగవరం: ఏపీ ఎసెంట్ పరీక్షా ఫలితాల్లో మదర్ థెరిసా విద్యాసంస్థ విద్యార్థులు 120 ర్యాంకులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. మొత్తం 150 మంది పరీక్షలు రాయగా 120 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. వీరిలో ఎంపీసీ చంద్రహాస్‌రెడ్డి 2705 ర్యాకుంతో మొదటి స్థానంలోనూ ఎం.గోవర్ధన్‌రెడ్డి 7014 ర్యాంకుతో ద్వితీయ స్థానంలోనూ బైపిసి గ్రూప్‌కి సంబంధించిన షాహిస్తా అజ్మీ 7256 ర్యాంకుతో మూడో స్థానంలో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకాడమిక్ అధికారి రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సునీల్ కుమార్‌రెడ్డి అభినందించారు.







ఎంసెట్‌లో


'మంగళ్' విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

బుధవారం విడుదల చేసిన ఎంసెట్ పరీక్షా ఫలితాలలో తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించి విజయభేరి మ్రోగించారని మంగళ్ విద్యాలయ వ్యవస్థాపక అధ్యక్షులు గల్లా రామచంద్ర నాయుడు ఓప్రకటనలో తెలిపారు. ఎస్.హేమంత్ కుమార్ రెడ్డి రాష్ట్రస్థాయిలో (2763) ర్యాంక్‌తో ప్రథమస్థానంలో నిలిచారని, అలాగే టి.పూర్ణచంద్ర (3004), ఎస్. దినేష్‌కుమార్ (4722), కె.మోనిక (6093), ఎం.నైపుణ్య (9112), ఎ.భార్గవి (9243), ఎస్.గిరీష్మ (10730) వరుస ర్యాంకులతో నిలిచి పాఠశాల ఘనకీర్తిని పెంచారని తెలిపారు. ఈవిజయానికి కషిచేసిన విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాపక బందాన్ని, గల్లా రామచంద్ర నాయుడు అభినందించారు.


ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో కార్మికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న దష్ట్యా జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాల విభజన అయిన తర్వాత చిత్తూరు జిల్లా నగరి నుంచి కుప్పం వరకు ఏడు నియోజకవర్గాల పరిధిలో వేలాది మంది కార్మికులు ఉన్నారని, వారికి ఈఎస్ఐలో సరైన వైద్యసేవలు అందడం లేదని తెలిపారు. చిత్తూరు నగరంలో ఓపికే పరిమితమైన ఈఎస్ఐ ఆసుపత్రుల లేక కార్మికులు దూరంలో ఉన్న తిరుపతికి వెళ్లలేక వేలాది రూపాయలు ప్రైవేట్ ఆసుపత్రులకు దారిపోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు వేతనాల నుంచి చెల్లిస్తున్న ఉచిత వైద్యం కోసం ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ వాటికి దరిచేర లేకపోతున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ 50పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పారిశ్రామికంగా అభివద్ధి చేస్తామని గంగవరం, జీడి నెల్లూరు, పలమనేరు ప్రాంతాల్లో కొత్తపరిశ్రమలు వచ్చాయని, ఇంకా రానున్నాయని ప్రభుత్వం ప్రకటిస్తున్నదని తెలిపారు. ఇప్పటికే ఉన్న వేలాది కార్మికులకు వైద్యసేవలు అందరం లేదని, ఇంకా కార్మికుల సంఖ్య పెరిగితే మరి ఇబ్బందికరమైన పరిస్థితి కార్మికులు ఎదుర్కోవాల్సిన వస్తుందని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈఎస్ఐ అధికారులు చొరవ చూపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరారు.

పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల అర్హులకు బుధవారం చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు పట్టాలు పంపిణీ చేశారు. స్థానిక 25వ డివిజన్ అరుల్నాదపురంలోని ఇల్లులేని పేదలకు పట్టాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని పేదలందరికీ పక్కా గృహాలు నిర్మించేలా జగనన్న కాలనీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, 25వ వార్డు ఇంచార్జ్ కుమార్, తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ డ్రైవర్ పోస్టుల భర్తీ



ఔట్ సోర్సింగ్ డ్రైవర్ పోస్టులకు హాజరైన అభ్యర్థులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలోని దిశ పోలీస్‌స్టేషన్‌లో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్స్ ఖాళీలను భర్తీ ప్రక్రియలో భాగంగా బుధవారం నుండి 16 తేదీ వరకు మూడు రోజులు జరిగే డ్రైవింగ్ టెస్ట్‌ను చిత్తూరు పట్టణంలోని ప్రశాంత్‌నగర్ డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నిర్వహించారు. ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల ఎంపికను అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్ పర్యవేక్షణలో, కమిటీ సభ్యులు ట్రాఫిక్ డి.ఎస్పీ విష్ణు రఘువీర్, డిటిసి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రావు, ఆర్ఐ మధు, జిల్లా పోలీస్ ఆఫీసర్ దస్తగిరి నేతృత్వంలో జరిగాయి. 311మంది అభ్యర్థులకు గాను మొదటి రోజున బుధవారం 100 మందికి డ్రైవింగ్, మెకానికల్, ట్రాఫిక్ సిగ్నల్స్ పై ఓరల్ పరీక్ష నిర్వహించారు. ఇందులో 65 మంది హాజరై డ్రైవింగ్ స్కిల్ టెస్ట్‌లో పాల్గొన్నారు. వీరికి డ్రైవింగ్ టెస్ట్‌తో పాటుగా మెకానికల్ స్కిల్స్, ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన ఉన్నదా లేదా అనే దానిపై కూడా ట్రాఫిక్ చిహ్నాలు చూపిస్తూ ఓరల్ పరీక్ష నిర్వహించారు.

నూతన ఆలయ కుంభాభిషేక వేడుకలు

ప్రజాశక్తి- నగరి: మండలంలోని కష్ణారామపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన మణియాత్తమ్మన్ నూతన ఆలయ అష్టబంధన మహాకుంభాభిషేక వేడుకలు బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం 6గంటల నుంచి ఆలంయంలో విఘ్నేశ్వర పూజ, తత్వార్చన, వేదికార్చన, పంచశుద్ధ హోమం, గణపతి హెూమం, మూలమంత్ర హోమం, మహాసంకల్పం పూజలను నిర్వహించి మహాపూర్ణాహుతి చేశారు. గోపూజ, యాత్రాదాన పూజలు నిర్వహించి విమాన కుంభాభిషేకం, మూలవిరాట్ కుంభాభిషేకం చేశారు. కుంభాభిషేక జలం కోసం గ్రామప్రజలు పోటీపడ్డారు. మహాధీపారాదన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కుంభాభిషేక వేడుకల్లో మంత్రి ఆర్కెరోజా సోదరులు వై.రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. కుంభాభిషేక నిర్వాహకులు ఆయనకు ఆలయ మర్యాదలు చేసి దుస్సాలువలతో సత్కరించి ఆహ్వానించారు. పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ రవికుమార్,సరస్వతి రాజగోపాల్‌రాజు, ఏలుమలైరెడ్డి, పరంధామరెడ్డి, రంగనాథం పాల్గొన్నారు.

నాడు- నేడు పనుల తనిఖీ

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు- నేడు పనులను ఎంపిడిఓ శ్రీదేవి తనిఖీ చేశారు. బుధవారం బాలగంగనపల్లె హైస్కూల్లో నాడు- నేడు పనులను, మధ్యాహ్న భోజనం పథకాన్ని, వింజం, అగరమంగళం సచివాలయాల్లో పలు రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం వేసవి తీవ్రత కారణంగా తాగునీటి సమస్య ఉన్నట్లయితే వెంటనే తనకు సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు జాబితా, అనర్హులు జాబితా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. ఈవోపిఆర్డి శివయ్య, కార్యదర్శి చిట్టెమ్మ, టీచర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



'రౌడీలతో దౌర్జన్యం చేస్తున్నారు'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రౌడీలతో దౌర్జన్యం చేస్తూ తమ భూమిని కబ్జా చేయడానికి పాల్పడుతున్నా కన్నమ్మ కుటుంబసభ్యుల నుంచి తనకు ప్రాణహాని ఉన్నదని చిత్తూరు మండలం బండపల్లి గ్రామానికి చెందిన శ్రీదేవి చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాను ఆశ్రయించారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ సర్వేనెంబర్ 51/7లో 95 సెంట్ల భూమిని తన దగ్గర కార్పొరేటర్ జయలక్ష్మి ఆమె భర్త రవి కొనుగోలు చేశారని తెలిపారు. అలాగే తమ దగ్గర నుండి అదే సర్వేనంబర్‌లో మరో 19సెంట్లు భూమిని కూడా కొనుగోలు చేశారని తెలిపారు. తమ భూమి పక్కనే కన్నమ భూమి ఉన్నదని వారి పొలానికి దారి లేకపోవడంతో 19 సెంట్ల భూమిని వదిలి వేయాలని తనపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కార్పొరేటర్ జయలక్ష్మి ఆమె భర్త రవిపై కూడా దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తెలిపారు. కార్పొరేటర్ జయలక్ష్మి దళితురాలు కావడంతో వారికి భూమిని ఇవ్వరాదని బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఇదివరకే కన్నమ్మ సోము, సుధాకర్, సునీల్ రౌడీలను తీసుకువచ్చి తమపై దౌర్జన్యం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కూడా కేసుపెట్టడం జరిగిందని తెలియజేశారు. వారి నుంచి తనకు ప్రాణహాని ఉన్నదని రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారం



ప్రజాశక్తి- నగరి: మండలంలోని తడుకుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభచూసి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు కె.సుబ్రమణ్యం నగదు పురస్కారం అందజేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థి వి.కావ్యకు రూ.10వేలు, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థి చంద్రుకు రూ.5వేలను జీవశాస్త్ర ఉపాధ్యాయులు కె.సుబ్రమణ్యం అందజేశారు. ప్రతిభ చూపే విద్యార్థులకు ప్రతిఏడాది ప్రోత్సాహాలు ఉంటాయని ప్రధానోపాధ్యాయులు వి.విజయ భాస్కర్ రెడ్డి తెలియజేశారు. ఈకార్యక్రమంలో కమిటీ చైర్మన్ సిందు, సర్పంచ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య : ఎమ్మెల్యే



విద్యార్థులకు విద్యా కానుక పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే , జడ్పీ వైస్‌చైర్మన్

ప్రజాశక్తి- యాదమరి: పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్యను అందించడమే జగనన్న లక్ష్యమని పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బడులలో చదువున్న విద్యార్థులకు పూతలపట్టు ఎమ్మెల్యే ఎమ్మెస్.బాబు, జెడ్‌పి వైస్‌చైర్మన్ బి.ధనంజయరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి రుక్మిణమ్మ జగనన్న విద్యాకానుక కిట్టు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని ఉన్నపాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.3వేలు ఏడుగురు విద్యార్థులకు, ద్వితియ బహుమతి రూ.2వేలు చొప్పున ఏడుగురికి, తృతీయ బహుమతి రూ.1000ల చొప్పున ఏడుగురికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న విద్యాకానుక, అమ్మఒడి, మధ్యాహ్న భోజనంలో అందిస్తున్న పౌష్టికాహారంను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని బాగా చదివి, ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. వైసిపి నాయకులు మనోహర్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి శివరాజన్, ఎస్ఐ సుమన్, హెచ్ఎంలు గిరిరాజా, భాస్కర్‌రావు, సర్పంచ్ ఝాన్సీ, ఉప సర్పంచ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి : ఎంపిపి



కార్వేటినగరంలో..

కార్వేటినగరం: ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే ఉన్నతస్థాయికి ఎదగవచ్చని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుకను కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పేద విద్యార్థుల కోసం విద్యకు, వైద్యానికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ చదువును ఎవ్వరు దొంగలించలేరని బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈసమావేశం పాఠశాల హెచ్ఎం గాయత్రి అధ్యక్షతన జరిగింది. సర్పంచ్ ధనంజయ వర్మ, ఏఈ నాగభూషణం, ఉపాధ్యాయులు నాగభూషణం, వేణుగోపాల్, మునిశేఖర్, బంగారమ్మ, వరలక్ష్మి, భారతి, గీత, కస్తూరి, చిత్ర, విజయలక్ష్మి, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని కందూరు, పెద్దఉప్పరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ప్రజాప్రతినిధులు జగనన్న విద్యా కానుక సామాగ్రిని పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల, పాఠశాలల అభివద్ధి కోసం నాడు నేడు, జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజనంను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఉన్నత స్థితికి చేరాలని కోరారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి : జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి- వికోట: మండల పరిధిలో జరుగుతున్న అభివద్ధి పనులను వేగవంతం చేయాలని జడ్పీచైర్మన్ శ్రీనివాసులు అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. మండల పరిధిలోని ముధురందొడ్డి పంచాయతీ నడిపేపల్లి గ్రామంలో జడ్పీ నిధులతో పూర్తి అయిన సిమెంట్ రోడ్డు పనులను ఇతర అభివద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వనిధులతో చేపట్టే అభివద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు ప్రత్యేకశ్రద్ధ కనపర్చాలని తెలిపారు. నాడు- నేడు కింద మంజూరైన నూతన పాఠశాల తరగతి గదులను త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొనిరావాలని సర్పంచ్ దామోదరంను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వైస్‌ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, ఎంపీటీసీ అతావుల్లా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న జడ్‌పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- నగరి

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ బుధవారం తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ప్రవేశానికి ఈ నెల 19 నుండి 24వ తేదీ వరకు విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నగరి పరిధిలోని ఉచితంగా ఆన్లైన్ ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులలో ప్రత్యేక ప్రతిభావంతులు ఎన్‌సిసి విద్యార్థులు, క్రీడాకారుల కోటాకు సంబంధించి ఈనెల 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూలై 3వ తేదీన సీట్లు కేటాయించి 4వతేదీ నుండి తరగతుల ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నగరి నందు బీఏ పొలిటికల్ సైన్స్ మేజర్, బీకాం జనరల్ మేజర్, కంప్యూటర్ అప్లికేషన్స్, బీబీఏ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ మేజర్, బీఎస్సీ కంప్యూటర్‌సైన్స్ మేజర్, కెమిస్ట్రీ మేజర్, బాటనీ మేజర్, మ్యాథమెటిక్స్ మేజర్, జువాలజీ, స్టాటిస్టిక్స్ మైనర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, విశాలమైన తరగతి గదులు, విశాలమైన లైబ్రరీ, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, కెరియర్ గైడెర్ఫ్ అండ్ కౌన్సిలింగ్ సెల్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని అర్హతలు కలిగిన అధ్యాపకులచే విద్యాబోధన, అందిస్తూ రాష్ట్రంలోనే న్యాక్ ద్వారా ఏం గుర్తింపు పొందిన రెండవ ప్రభుత్వ కళాశాలగా, నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిలిచిందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంతం పరిధిలోని ప్రతివిద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

వెదురుకుప్పం: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో డిగ్రీ ప్రవేశప్రక్రియ ప్రారంభమైందని, ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బిఏ కంప్యూటర్స్, బికాం కంప్యూటర్స్, బిఎస్సీ బిజెడ్‌సి, బీఎస్సీ ఎంపిసిఎస్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాశాలలో చేరదలచిన వారు సంబంధించిన సర్టిఫికెట్లన్నీ ఒరిజనల్ పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో జూన్ 24వ తేదీ లోపు చేరవచ్చునని ప్రిన్సిపాల్ తెలిపారు. మరిన్ని వివరాలకు డాక్టర్ భరణినాథ్ రెడ్డి, 98851 25771, నరేంద్ర బాబు 77029 17803, డాక్టర్ భీమ మోహనరావు 97044 25888 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

స్వచ్ఛంద రక్తదానం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం, సిపిఎఫ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంయుక్తంగా దిగువమాసాపల్లి, బొమ్మ సముంద్రంలోని సిపిఎఫ్ కంపెనీ బ్రాంచ్‌లలో మెగా రక్తదాన శిభిరం నిర్వహించారు. 77మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారు నిరంతరం రక్తదానం చేస్తూ ఉంటామని ప్రతిజ్ఞ చేయించి, అందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు బాలాజీ, జయ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ చిరంజీవి, రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.

జాతరకు రూ.50వేలు విరాళం



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె కాలనీలో జరుగుతున్న గంగమ్మ జాతరను పురస్కరించుకుని టీడీపీ జీడీనెల్లూరు మీడియా కోఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్ రూ.50వేలు నగదును బుధవారం విరాళంగా అందజేశారు. ఈ క్రమంలో గురుసాల కిషన్ చంద్‌కు గ్రామపెద్దలు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఆయన వెంట శ్రీరాములు, గోవిందయ్య, గ్రామస్తులు ఉన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి- యాదమరి: చిన్నారులందరికీ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సిహెచ్ఓ లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం యాదమరిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిహెచ్ మాట్లాడుతూ మాతాశిశుమరణాలను పూర్తిగా నిర్మూలించేందుకే ప్రభుత్వం వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండేలాగా ఉపఆరోగ్య కేంద్రాల్లో బుధవారం, శనివారం మారుమూల గ్రామాల్లో ఈ వ్యాధి నిరోధక టీకాలను వేయిస్తున్నామని ఆయన అన్నారు. 100 శాతం గర్భవతులకు చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేయాలని, అప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారని సిహెచ్ఓ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్త జ్యోతి, ఆశా కార్యకర్తలు ధనలక్ష్మి, అరుణ కుమారి, గర్భవతులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పద్మావతి ఆధ్వర్యంలో స్థానిక జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు 'బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం'పై హెల్త్ ఎడ్యుకేటర్ ఏ.శ్రీదేవి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు శారీరకంగా, మానసికంగా పూర్తిస్థాయిలో ఎదిగిన తరువాతనే వివాహాలు చేయాలన్నారు. బాలికలకు 21, బాలురకు 25 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేసుకోవాలన్నారు. బాల్యావివాహాలు నిర్వహిస్తే చట్టరిత్యా నేరమని, వివాహం చేయాలనుకునే వారికి రెండు సంవత్సరాలు శిక్ష పడుతుందని తెలిపారు. బాల్యవివాహాల వలన మాతాశిశు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని కనుక బాలికలు ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పాటును అందించాలని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ లత, ఏఎన్ఎం సూర్యకల, అంగన్వాడీలు, ఆశలు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు అవగాహన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: స్థానిక సబ్‌స్టేషన్‌లో వినియోగదారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఏఈ హేమచంద్రుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ కోసం తొమ్మిది గంటల కరెంటు ఇస్తున్నామని రాబోయే రోజుల్లో గ్రామాలకు త్రీఫేస్ లైన్ ద్వారా గహాలకు వ్యవసాయానికి, వాణిజ్య అవసరాలకు 24గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా ప్రభుత్వ వారు చర్యలు చేపట్టారని తెలిపారు.

అంగన్వాడీ సేవలను వినియోగించుకోండి..

ప్రజాశక్తి- శాంతిపురం: అంగన్వాడీ సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఐసిడిఎస్ సిబ్బంది కల్పన, సుగుణ, రేవతి అన్నారు. బుధవారం శాంతిపురం ఐసిడిఎస్ వారి ఆధ్వర్యంలో జన బాగిదారి కార్యక్రమం మండల, గ్రామస్థాయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల్లో కూడా ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ఇంగ్లీష్ విద్యను నేర్పించడం జరుగుతోందన్నారు. అంగన్వాడీలో విద్యతోపాటు పిల్లలకి పోషకాహారం కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

సుమో, ద్విచక్ర వాహనం ఢీ - వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో మరణించిన కృష్ణమూర్తి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: సుమో ద్విచక్రవాహాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నెల్లిపట్ల గ్రామానికి చెందిన కృష్ణమూర్తి టైలర్ మృతి చేసుకుంటూ జీవిస్తున్నారు. సొంత పనుల నిమిత్తం కృష్ణమూర్తి అతని కొడుకు హరీష్ పుంగనూరు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బట్టందొడ్డ సమీపంలో సుమో అతివేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే కృష్ణమూర్తి మరణించారు. స్థానికులు తీవ్రంగా గాయపడిన షరీష్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతి రుయా తరలించినట్లు వీరి బంధువు టిడిపి ఇన్‌చార్జి జగదీష్ తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం కృష్ణమూర్తి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి...



ప్రజాశక్తి- వికోట: మండల పరిధిలోని కోటనక్కనపల్లి గ్రామసమీపంలోని చెరువులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మతి చెందిన సంఘటన వెలుగు చూసింది. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నక్కనపల్లి సమీపంలోని చెరువులో ఓ వ్యక్తి మతదేహం నీటిలో తేలుతుండటాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని బయటకు తీశారు. మతి చెందిన వ్యక్తి కర్ణాటక రాష్ట్రం తాయిలూరుకు చెందిన రామమూర్తి (40)గా గుర్తించారు. కర్ణాటక రాష్ట్రంకు చెందిన వ్యక్తి ఆంధ్రాలో చెరువులో శవమై తేలడంతో అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న టెంపో

ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- శాంతిపురం: మండల కేంద్రంలో 42వ జాతీయ రహదారిపై వెటర్నరీ హాస్పిటల్ ఎదురుగా బుధవారం ఓ ద్విచక్ర వాహనాన్ని టెంపో ఢీకొంది. ఈఘటనలో కుప్పం మండలం గుడ్లనాయనపల్లి గ్రామానికి చెందిన యువకులకు తీవ్రగాయాలయ్యాయి. రాళ్ల బూదుగూరు పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుప్పం మండలం గుడ్లనాయనపల్లి గ్రామానికి చెందిన మాదేష్ (28), అదే గ్రామానికి చెందిన మురళి(23)లు కుప్పం వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కుప్పం నుంచి వస్తున్న టెంపో వీరిని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మాదేష్‌కు తీవ్రగాయాలుకాగా మురళికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు వీరిని 108 వాహనంలో స్థానిక పిఈఎస్ ఆసుపత్రికి తరలించారు. రాళ్ల బూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపి నాయకుడి మృతికి నివాళి



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని చీలంపల్లి గ్రామానికి చెందిన తల్లారి వెంకటప్ప బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, రాజంపేట పరిశీలకులు కృష్ణమూర్తి చేలంపల్లి గ్రామానికి చేరుకుని వెంకటప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయన వెంట పెద్దపంజాణి వైస్‌ఎంపిపి బాబు, మునివెంకటరాజు రెడ్డి ఉన్నారు.